ఓట్ల పండగకు వేళాయె

- కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- పెందుర్తి బరిలో 14 మంది అభ్యర్థులు
- ఓటర్లు 3,075,45 మంది
- పోలింగ్ కేంద్రాలు 299
- దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు



పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

సిబ్బంది కేటాయింపు ఇలా..

పోలింగ్ కేంద్రానికి 7 గురు చొప్పున 441 పోలీసు సిబ్బందిని కేటాయించడం జరిగిందన్నారు. డీఎస్పీ, సీఐ మొబైల్ పార్టీతో పాటు ముగ్గురు ఎస్‌ఐలు, ప్రత్యేక పార్టీలను నియమించామని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా 144 సెక్షన్ ఏర్పాటు చేశామని సీఐ బాలసూర్యారావు చెప్పారు.

పెందుర్తి: సార్వత్రిక సమరానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులు చేరాయి. ఎన్నికల సిబ్బంది చేరుకున్నారు. సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది. నియోజకవర్గంలో మొత్తం 299 పోలింగ్ కేంద్రాల ద్వారా 3,075,45 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అవసరమైన చోట అదనపు కేంద్రాలను అప్పటికప్పుడు ఏర్పాటు చేసి పోలింగ్ కొనసాగిస్తారు. ఈవీఎం యంత్రాలు, ఇతర సామగ్రితో ఎన్నికల సిబ్బంది ఆదివారం సాయంత్రానికే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. రిటర్నింగ్ అధికారి పి.శేష శైలజ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ సాగుతోంది.



వాడచీపురుపల్లి పోలింగ్ కేంద్రానికి చేరుకున్న పోలింగ్ సిబ్బంది



పోలింగ్ కేంద్రం ఆవరణలో వేసిన టెంట్

పోలింగ్‌కు అంతా రెడీ



అడవివరం ఎంపీపీ స్కూల్‌కు చేరుకున్న పోలింగ్ సిబ్బంది

సింహాచలం: జీవీఎంసీ 98వవార్డు భీమిలి నియోజకవర్గం పరిధిలో 16 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. సుమారు 15వేల మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.



పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన టెంట్లు

పెందుర్తి నియోజకర్గం పరిధిలో..

జీవీఎంసీ 93వవార్డులో మొత్తం 19 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఆయా బూత్‌ల్లో 21,683 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

144 సెక్షన్ అమలు

ఎన్నికల నేపథ్యంలో భారీ ఎత్తున పోలీసు బలగాలు మోహరించాయి. నియోజకవర్గం మొత్తం 144 సెక్షన్ అమల్లో ఉంది. ఓటు వేసేందుకు వచ్చే దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కేంద్రాల వద్ద వీల్ చైర్లు అందుబాటులో ఉంచారు. అన్ని కేంద్రాల్లో విద్యుత్, తాగునీటి సదుపాయం ఉండేలా చర్యలు తీసుకున్నారు. కాగా పెందుర్తి అసెంబ్లీ నుంచి మొత్తం 14 మంది బరిలో ఉన్నారు. వీరిలో తొమ్మిది మంది వివిధ పార్టీలు బలపరిచినవారు కాగా ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులు పోటీలో నిలిచారు.



ముత్యాలమ్మపాలెం పోలింగ్ బూత్ వద్ద వేసిన షామియానా

సాంకేతికత సహాయంతో పోలింగ్ పర్యవేక్షణ

సార్వత్రిక ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని రిటర్నింగ్ అధికారి శేష శైలజ చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు మొత్తం 3 వేల మంది సిబ్బందిని నియమించామన్నారు. 56 అతి సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు గుర్తించారు. సాంకేతిక సహాయంతో పర్యవేక్షణ చేయనున్నట్టు తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినవారిపై నిబంధనల ప్రకారం తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు.

పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ బరిలో ఉన్న అభ్యర్థులు, గుర్తులు.

అభ్యర్థి	పార్టీ	గుర్తు
అన్నంరెడ్డి అదీప్‌రాజ్	వైఎస్సార్‌సీపీ	సీలింగ్ ఫ్యాన్
బంగారి రమణ	బహుజన సమాజ్ పార్టీ	ఏనుగు
భగత్ పిరిది	కాంగ్రెస్	హస్తం
ఈత రోజ	పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా	ఫ్లూట్
ఏలూరు వెంకటరమణ	జాతీయ జనశక్తి పార్టీ	గృహం
కన్నెపల్లి మహాదేవ్ కల్యాణ్ శ్రీకాంత్	జై భారత్ జాతీయ పార్టీ	బ్యాటరీ టార్చ్
రమేష్‌నాయుడు	నవరంగ్ కాంగ్రెస్ పార్టీ	బకెట్
పంచకర్ల రమేష్‌బాబు	జనసేన	గ్లాస్ టంబ్లర్
బోతెం వెంకట మురళీ మోహన్	సమాజ్‌వాదీ పార్టీ	సైకిల్ పంప్
ఆదారి నాగరాజు	ఇండిపెండెంట్	విజిల్
కూండ్రపు సన్యాసిరావు	ఇండిపెండెంట్	కుట్టు మిషన్
పొన్నాడ అప్పలనాయుడు	ఇండిపెండెంట్	గ్యాస్ స్టవ్
గుంటూరు వెంకటనరసింహారావు	ఇండిపెండెంట్	రింగ్
వడ్డాది ఉదయ్‌కుమార్	ఇండిపెండెంట్	టీవీ రిమోట్

పోలింగ్ శాతం పెంచేలా చర్యలు

నియోజకవర్గంలో పోలింగ్ శాతాన్ని పెంచడానికి ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్టు చెప్పారు. అలాగే ఆర్వో కార్యాలయం వద్ద పోలింగ్ సరళిని తెలుసుకోవడానికి ప్రత్యేక తెర ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తద్వారా ప్రతీ గంటకు పోలింగ్ శాతాన్ని ప్రదర్శిస్తామన్నారు.

అక్రమాలు జరిగితే ఫిర్యాదు చేయండి

ఎక్కడైనా ఓటర్లను ప్రలోభ పెట్టే చర్యలు చేపట్టినా.. ఓటు హక్కు వినియోగించడానికి ఇబ్బంది పెట్టినా తమకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ఎవరూ నచ్చకపోతే నోటా వినియోగించుకోవచ్చని చెప్పారు.

11 రకాల కార్డులతో ఓటు వినియోగం

జాతీయ ఎన్నికల సంఘం సూచన మేరకు 11 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి తెచ్చినా ఓటు వేయవచ్చని తెలిపారు. పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, సర్వీస్ గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డు, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ/పీఎస్‌యూ/పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు/పోస్టాఫీస్ పాస్‌బుక్‌లు, పాన్‌కార్డు స్మార్ట్‌కార్డు, ఆర్‌జీఐ ఎన్‌పీఆర్ స్మార్ట్ కార్డు, పింఛన్ డాక్యుమెంట్, ఎంపీ, ఎమ్మెల్యేల కార్యాలయపు ఐడీ కార్డుల్లో ఏదో ఒకటి చూపి ఓటు వేయవచ్చన్నారు.

పరవాడలో ఏర్పాట్లు పూర్తి

పరవాడ: సార్వత్రిక ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో 64,459 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. జీవీఎంసీ పరిధిలో 19,945 మంది, రూరల్ మండలంలో 44514 మంది ఓటర్లు ఉన్నారని పెందుర్తి అసిస్టెంట్ ఎన్నికల అధికారి, తహసీల్దార్ ఎం.గణపతిరావు చెప్పారు. మండలంలోని 63 పోలింగ్ బూత్‌ల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కేంద్రాల వద్ద సిబ్బందికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించినట్టు చెప్పారు. సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించిన పెదముషిడివాడ, ముత్యాలమ్మపాలెం, మూల స్వయంభూవరం, తాడి గ్రామాల్లో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు.

క్లుప్తంగా

శ్రీశారదాపీఠంలో ఘనంగా శంకర జయంతి



శంకరాచార్యులుకు పూజలు చేస్తున్న స్వామీజీ

పెందుర్తి: విశాఖ శ్రీశారదాపీఠంలో జగద్గురు ఆది శంకరాచార్యులు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ చేతుల మీదుగా ఆది శంకరుడికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం గురు పూజ, గురు వందనం జరిగాయి. వేదపండితులు, వేద పాఠశాల గురువులు, వేద విద్యార్థులు స్వామీజీకి గురువందనం సమర్పించి ఆశీసులు తీసుకున్నారు. అద్వైత వ్యాప్తికి శంకరాచార్యులు ఎనలేని కృషి చేశారని..అందువల్లనే సనాతన ధర్మం ఇప్పటికీ వెలుగొందుతోందని స్వామీజీ పేర్కొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం శ్రీకాకుళానికి చెందిన బి.తారకరామారావు అనే దాత రూ.1.05 లక్షలు అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు బాండ్ ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అందజేసి దర్శనం కల్పించారు.

ముగిసిన తిరునక్షత్రం పూజలు

ఘనంగా భగవత్ రామానుజాచార్యుల జయంతి



హంస మూలన పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం విశిష్టాద్వైత స్థాపకులు భగవత్ రామానుజాచార్యుల జయంతిని వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడామండపంలోని హంసమూలన వరాహలక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవితో పాటు రామానుజాచార్యుల ఉత్సవమూర్తిని అధిష్టింపజేసి షోడషోపచార పూజలు చేశారు. తిరువీధిని ఘనంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అధ్యాపకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదు రోజులుగా నిర్వహించిన తిరునక్షత్రం పూజలు ఘనంగా ముగిశాయి.

తరలిన విద్యార్థులు.. వర్సిటీ నిర్మానుష్యం



నిర్మానుష్యంగా ఏయూ పరిపాలన భవనానికి వెళ్లే మార్గం

ఏయూ క్యాంపస్: ఓటు వేసేందుకు విద్యార్థులు తమ స్వగ్రామాలకు తరలిపోవడంతో ఆంధ్ర విశ్వవిద్యాలయం బోసిపోయింది. వర్సిటీ రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. నార్త్ క్యాంపస్‌ను పూర్తిగా ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు వినియోగిస్తున్నారు. సౌత్ క్యాంపస్ మాత్రం విద్యార్థులు లేక బోసిపోయింది. దీనికి తోడు రెండో శనివారం, ఆదివారం కలసి రావడంతో వర్సిటీ మొత్తం ఖాళీ అయిపోయింది. వర్సిటీ ఉద్యోగులు సైతం ఎన్నికల విధులకు వెళ్లిపోయారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి



లంకెలపాలెంలో ఆది శంకరాచార్యులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భక్తులు



పరవాడలో రామానుజాచార్యుల జయంతి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

పరవాడ: సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరవాడ, లంకెలపాలెం గ్రామాల్లో ఆదివారం దేవాలయాలు కేంద్రంగా ఆది శంకరాచార్యులు, రామానుజాచార్యులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ ప్రతినిధి రాము మాట్లాడుతూ హిందూ ధర్మం కోసం అన్ని పీఠాధిపతులు శక్తి పీఠాలను ఒక చోట చేర్చి హిందూ ధర్మం కోసం పని చేయాలని చెప్పిన వ్యక్తి ఆదిశంకరాచార్యులున్నారు. కులమతాలకు అతీతంగా అంతా సమానంగా ఉండాలన్నారు. దేవాలయాల్లో అందరూ సమానమేనని శంకరాచార్యులు పేర్కొన్నారని వివరించారు. కార్యక్రమంలో మాతృమూర్తులు దాసరి లక్ష్మి, చంద్రకళ, ఎస్.లక్ష్మి, పరవాడలో ఎలమర్తి వెంకటరమణ, పి.రామచంద్రావు, ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

డాబాగార్డెన్స్ : విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని భారత్ వికాస్ పరిషత్ జాతీయ స్థాయి ఉపాధ్యక్షుడు రమేష్‌చంద్ జైన్ సూచించారు. వన్‌టౌన్ ఏరియా గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో గత పది రోజులుగా నిర్వహిస్తున్న బాల బాలికల మనోవికాస వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఏకాగ్రతతో బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. గీతా ప్రచార సమితి నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు. అనంతరం ప్రముఖుల చేతుల మీదుగా వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న వారందరికీ ప్రశంసా పత్రాలు, విజేతలకు బహుమతులు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు పి. జగనమోహన్‌రావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, కార్యదర్శి ఎం. వనజాదేవి పాల్గొన్నారు.

సబ్బవరంలో 59,542 మంది ఓటర్లు



వెదుళ్లనరవ మండల పరిషత్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ రమణ



ఎన్‌సీసీ,ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు టీషర్టు అందిస్తున్న సీఐ రమణ



రాయపుర అగ్రహారం పోలింగ్ స్టేషన్‌కు చేరుకున్న ఎన్నికల సిబ్బంది

సబ్బవరం: మండలంలో సోమవారం నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల్లో 59,542 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో 30,938 మహిళా ఓటర్లు, 29,143 మంది పురుష ఓటర్లు, ట్రాన్స్ జెండర్ ఒకరు ఉన్నారు.వీరి కోసం మండలంలో 60 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. పోలింగ్ నిర్వహించేందుకు అవసరమైన పోలింగ్ సామగ్రితో సహా సిబ్బంది ఆదివారం సాయంత్రం ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.

అంతా ఓటు వేయాలి

మండలంలోని ఓటర్లంతా సోమవారం నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ పిన్నింటి రమణ కోరారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా సౌకర్యాలు కల్పించామన్నారు. మండలంలోని 50 పోలింగ్ స్టేషన్లకు గాను 110 మంది పోలీస్, ఆర్మ్‌డ్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.వీరితో పాటు అదనంగా మరో 30 మంది ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, ఎక్స్ సర్వీస్‌మెన్ సేవలను వలంటీర్‌గా వినియోగించుకోవడం జరుగుతుందన్నారు. మొత్తం 7రూట్లుగా విభజించడంతో రూట్ ఆఫీసర్లు పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. ఒక్కో పోలింగ్ స్టేషన్ వద్ద కనీసం ఒక కానిస్టేబుల్ ఉండే విధంగా చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. మండలంలో 6 సమస్యాత్మక గ్రామాలుగా,20 వరకూ క్లిష్టమైన గ్రామాలుగా గుర్తించి అదనపు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే మండలంలో 600 మంది వరకూ బైండోవర్ చేసినట్టు చెప్పారు.

ఘనంగా మాతృ దినోత్సవం

మురళీనగర్: వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టాభిరెడ్డితోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో మాతృ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి ఆధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఆశ్రమంలోని వృద్ధులకు సేవ చేస్తూ కమ్మని ఆహార పదార్థాలు వండి పెడుతున్న మహిళను సత్కరించి చీర, నగదు బహుమతిగా అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జయ, కోశాధికారి శీలారాణి, పూర్వ అధ్యక్షురాలు జె.ఉమాదేవి, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పూర్తి స్థాయి ఉత్పత్తికి సహకరించండి

కేంద్ర ఉక్కు కార్యదర్శికి ఇంటక్ వినతి



కేంద్ర ఉక్కు కార్యదర్శి సిన్హాకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ పూర్తి స్థాయి ఉత్పత్తికి ఉక్కు మంత్రిత్వశాఖ సహకరించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు కేంద ఉక్కు కార్యదర్శి నాగేంద్ర నాథ్ సిన్హాను కోరారు. స్టీల్‌ప్లాంట్ పర్యటనకు విచ్చేసిన కేంద్ర కార్యదర్శిని ఐఎన్‌టీయూసీ మిత్రపక్షాల నాయకులు ఆదివారం హిల్‌టాప్ గెస్ట్‌హౌస్‌లో కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన వర్కింగ్ క్యాపిటల్, రా మెటీరియల్‌ను అత్యవసరంగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ముడి పదార్థాల కొరత తీరడానికి ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని కోరారు. సెయిల్ మాదిరిగా వేతన ఒప్పందం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నీరుకొండ రామచంద్రరావు, మంత్రి రాజశేఖర్, వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప, డి.పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

• ప్రగతి సంతకం

అభివృద్ధి ఏ ఒక్క రంగానికో, ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాకూడదు. ప్రతీ చోట ప్రగతి పరవళ్లు తొక్కాలి. ప్రతీ కుటుంబంలో సంక్షేమ కాంతులు వెల్లివిరియాలి. ఆర్థిక స్థోమతతో సంబంధం లేకుండా ప్రతీ విద్యార్థి ఉన్నత చదువులు చదవాలి. ఏ ఒక్క నిరుపేదకు వైద్యం అందని పరిస్థితి ఉండకూడదు. ప్రతీ ఒక్కరికీ కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందాలి. రహదారులు ప్రగతి మార్గాలు కావాలి.. ప్రజలకు పాలన చేరువ కావాలి.. మహిళా సాధికారత ప్రతిఫలించాలి. ఇదంతా సాధ్యమేనా అనే ప్రశ్నే లేకుండా ఐదేళ్ల పాలనలో ఇవన్నీ కళ్లముందు సాక్షాత్కరింపజేశారు. ఫలితంగా ప్రతీ ఇల్లు ఆనందాల పొదరిల్లులా మారింది. దానికి నిదర్శనమిదీ..

– పెందుర్తి



పరవాడ జగనన్న కాలనీలో పూర్తి అయిన ఇళ్లు



విశాలంగా పెందుర్తి- సబ్బవరం- అనకాపల్లి రహదారి



నూతనంగా నిర్మించిన సుజాతానగర్ రోడ్డు



జుత్తాడలోని గ్రామ సచివాలయం



సకల వసతులతో పురుషోత్తపురం అర్బన్ హెల్త్ సెంటర్



నాడు- నేడులో అభివృద్ధి చేసిన గొటివాడ పాఠశాల